




పాఠశాలలో తనిఖీ

నెల్లూరు : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి బైజుస్ ట్యాబుల లోపాల సవరణ మహోన్నత కార్యక్రమంలో భాగంగా జిల్లాకు గురువారం రాష్ట్ర కమిషనర్ కార్యాలయ అధికారి రమేష్ నగరానికి విచ్చేశారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు పాఠశాలల నుసందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన బైజూస్ టాబుల్లో నెలకొంటున్న సమస్యలను ఏ తరహాలో పరిష్కరించుకోవాలని విద్యార్థులకు వివరించారు. అదే సమయంలో ట్యా బులను ఏ విధంగా పరిశుభ్రపరుచుకోవాలో తెలిపారు. స్క్రీన్ పగిలిపోయిన టాబులు ఉంటే వాటిని సమీప సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ లేదా వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు అందజేసి రశీదు తీసుకోవాలన్నారు. చివరగా విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయులు విజయ ప్రకాష్‌ను శాలువా కప్పి సన్మానించారు. జిల్లా డిస్టిక్ నోడల్ ఆఫీసర్స్ కె.వి.ఆర్ మూర్తి ,సమగ్ర శిక్ష ఏపీవో అద్దంకి ప్రసాద్ పాల్గొన్నారు.



కందుకూరు

టిడిపిలో ముఠా గొడవలకు చెక్

దిద్దుబాటు చర్యలు చేపట్టిన అధినేత చంద్రబాబు - కార్యాలయాన్ని తీసేయాలని రాజేష్‌కు ఆదేశం

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి అధిష్టానం కందుకూరు నియోజకవర్గ పార్టీని చక్కదిద్దే పనిలో పడింది. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీని గెలుపు బాట పట్టించేందుకు అధినేత చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఆయన బుధవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కందుకూరు నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో కఠిన చర్యలు తీసుకుంటూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో టిడిపిలో ప్రత్యక్షంగా రెండు గ్రూపులున్నాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు నాయకత్వంలో ఒక గ్రూపు నడుస్తుండగా మరో గ్రూపు టిడిపి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ కనుసన్నల్లో నడుస్తోంది. ఈ ఇద్దరు నాయకులు దాయాదులే.. ఒకే ఊరు. వలేటివారిపాలెం మండలంలోని బడేవారిపాలెం వీరు స్వగ్రామం. ఆ ఇద్దరు నాయకులు హైదరాబాదులో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఇంటూరి రాజేష్ కు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి దక్కలేదు. ఏడాది కిందట అధిష్టానం ఇంటూరి నాగేశ్వరరావు ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించింది. అధిష్టానం మొగ్గు నాగేశ్వరావు వైపే ఉందని స్పష్టంగా తెలిసినప్పటికీ రాజేష్ వెనక్కు తగ్గలేదు. తన కార్యక్రమాలను నిరతరాయంగా జరుపుతూ ఉన్నారు. కందుకూరు పట్టణంలో సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసి తన గ్రూపు రాజకీయాలు సాగిస్తూ వస్తున్నారు. దానిపై ఇప్పుడు పార్టీ అధిష్టానం కన్నేసింది. ఒక ఊరిలో రెండు పార్టీ కార్యాలయాలు నడపడానికి వీల్లేదని, సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని ఇంటూ రాజేష్‌ను చంద్రబాబు నాయుడు ఆదేశించారు. తన మాటలను దిక్కరిస్తే రాజేష్‌ను వదులుకోవడానికి కూడా పార్టీ ఎనకాడబోదని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలిసింది. కందుకూరు నియోజకవర్గ ంలో రాజకీయాలను వదిలేసి ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు సహకరించాలని రాజేష్‌ను చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 'నీ రాజకీయ భవిష్యత్తు తాను చూసుకుంటానని రాజేష్‌కు చంద్రబాబు భరోసా ఇచ్చారు. దీంతో కందుకూరు నియోజకవర్గంలో గ్రూప్ తగాదాలు దాదాపుగా ముగిసినట్లేనని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో రాజేష్‌కు అంటూ ఒక గ్రూపు ఉంది. ఆ గ్రూపు నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా ఇన్నాళ్లు వ్యవహరిస్తూ వచ్చింది. వాస్తవానికి రాజేష్ గ్రూపులో స్వయం ప్రకటిత నేతలు మాత్రమే ఉన్నారు. వారికి ఓటర్లు బలగం పెద్దగా లేదని చర్చ ఉంది. ఈ నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యుడు డాక్టర్ దివి శివరాం, పోతుల రామారావు గ్రూపులు ఉన్నాయి. దివి శివరాం కూడా చాలా కాలంగా ఇంటూ నాగేశ్వరరావుకు మద్దతు పలుకుతున్నప్పటికీ అక్కడ ఆయన గ్రూపు సభ్యులు తమ ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నాగేశ్వరరావు తమను కలుపుకొని పోవటం లేదని శివరాం అనుచరులతో పాటు రాజేష్ వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహుశా ఈ విషయం చెవిన పడిందేమో నియోజకవర్గంలో అందర్నీ కలుపుకొని పోవాలని నాగేశ్వరరావును సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు ఆదేశించారు. మాజీ ఎంఎల్ఎ పోతుల రామారావుకు నియోజకవర్గంలో సొంత అనుచరులంటూ లేరు. కాకపోతే వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోతులకే అభ్యర్థిత్వం దక్కాలని భావించేవారు కొద్దిమంది ఉన్నారు. అయితే వారు ఎవరు పోతులకు బహిరంగంగా మద్దతు తెలపడం లేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పోతుల రామారావు ఈ నియోజకవర్గ రాజకీయాలకు దాదాపు దూరంగా ఉన్నారు. కొందరు ఇళ్లలో జరిగే శుభ, అశుభ కార్యక్రమాలకు మాత్రం అప్పుడప్పుడు పోతల రామారావు హాజరవుతున్నారు.



టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతో ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్



సమన్వయంతో పనిచేయాలి :కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో మెడికల్ అండ్ హెల్త్ , మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, జిల్లా గ్రామీ ణాభివద్ధి శాఖ, ప్రణాళిక శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో భాగంగా మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో 100 శాతం అమలు తదితర అంశాలపై చేపట్టాలసిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ, సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో భాగంగా ప్రాధాన్యత ఇండికేటర్స్ లక్ష్య సాధనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దష్టి సారించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రెండు వారాలకు కొక సారి ఈ అంశాలపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పిడి సాంబశివా రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పెంచలయ్య, జిల్లా ప్రణాళికా అధికారి సాలెమ్ రాజు, ఐసీడీఎస్ పిడి హేమ సుజన, గురుకుల పాఠశాలల డీసీఓ హేమలత, గ్రామ, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని అన్నీ సంక్షేమ హాస్టల్స్ లో, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆసుపత్రుల్లో సురక్షితత్రాగునీటి సదుపాయం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్లో సంక్షేమ శాఖల అధికారులు, వైద్య, పరిశ్రమలు, గనులు, వాణిజ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులతో సమావేశమై జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్ లోని పిల్లలకు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆసుపత్రులకు వచ్చే రోగులకు కార్పొరేట్ సెక్టార్ వారి సహకారంతో సురక్షిత మైన త్రాగునీటి సదుపాయం కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, మైన్స్ శాఖ డిడి శ్రీనివాస్, జిఎస్టి జాయింట్ కమీషనర్ ఏ. రవీంద్రనాధ్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, డిసిహెచ్ఎస్. రమేష్ నాథ్, ఐటిడిఎ పిఓ మందా రాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, గురుకుల పాఠశాలల డిసిఓ హేమలత పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి -నెల్లూరు

సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 4న ప్రభుత్వం ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న సమరభేరి ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం రూరల్ కమిటీ పిలుపు నిచ్చింది. గురువారం సిపిఎం రూరల్ కమిటీ కార్యదర్శి బత్తల కృష్ణయ్య విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం వి .ఆర్ .సి గ్రౌండ్ నుంచి సిపిఎం సమరభేరి మహా ప్రదర్శన కలెక్టరేట్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. గత నెల 31, సెప్టెంబర్ 1వ తేదీ వరకు రూరల్ లోని అన్ని డివిజన్లో సిపిఎం బృందాలు ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నాయన్నారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్నులు, నీళ్లపన్నులు ,చెత్త పన్ను, నిత్యావసర ధరలు , అర్హులైన వారికి తొలగించిన పింఛన్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు వెంటనే టిడ్కో ఇల్లు, ఇంటి పట్టాలు, ఇంటి స్థలాలు తదితరు అన్ని సమస్యలను సిపిఎం రూరల్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యలన్నింటిపై ప్రజల నుంచి సిపిఎం రూరల్ కమిటీ, స్థానిక శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో సంతకాలు సేకరిస్తున్నామన్నారు. సంతకాల సేకరణ సందర్భంలో పై సమస్యలపై అర్జీలు వ్రాయించి సెప్టెంబర్ 2వ తేదీ శనివారం అన్ని డివిజన్లో సచివాలయం వద్ద ధర్నాలు నిర్వహించి సచివాలయ అధికారులకుఅర్జీలను అందజేయనున్నట్లు తెలిపారు. 4న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

గుడ్లూరు : సిపిఎం సమర భేరీలో భాగంగా ,అధిక ధరలు ,కరెంటు ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4వరకు ప్రచార కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా గుడ్లూరు మండల కేంద్రంలో ఆగస్టు 30,31, తేదీల్లో సిపిఎం అధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. గుడ్లూరులో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్యలపై 1న సచివాలయం వద్ద, 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు చేపడతామని సిపిఎం మండల కన్వీనర్ జి వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. సిపిఎం నాయకులు కొట్టే వెంకయ్య, పాలకీర్తి నాగేశ్వరరావు ,అర్ మాల్యాద్రి, మన్నెం సుబ్రమణ్యం,ఎస్‌కె షరీఫ్ ఉన్నారు.



ఉలవపాడు మండలంలో..


కందుకూరు : ఉలవపాడు మండల కేంద్రంలో ఎంపిడిఓ ఆఫీస్ వద్ద గత రెండు, మూడు తరాలుగా నివాసముంటున్న గిరిజనులకు ప్రభుత్వమే బాధ్యత తీసుకొని వారు నివాసం ఉన్నచోటనే ఇళ్లను నిర్మించాలని సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జివిబి కుమార్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఉలవపాడు మండలంలో జరుగుతున్న సమరభేరి కార్యక్రమంలో భాగంగా గురువారం కోటిరెడ్డి కుంట గిరిజన కాలనీలో సిపిఎం నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 4న ఉలవపాడు తహశీల్దార్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం మండల నాయకులు ఎస్.డి. గౌస్ భాషా, ఎస్.కె. సుల్తాన్, కత్తి తాతయ్య,చేవూరి. వెంకటేశ్వర్లు, నాగమ్మ,కత్తి. అన సూయమ్మ, వై.మనోహర్ ఉన్నారు.

నిషార్ అహ్మద్‌కు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : గుడ్లూరు మండలం, దప్పలంపాడు గ్రామానికి చెందిన గుడ్లూరు మండల మాజీ కో- ఆప్షన్ మెంబర్ నిషార్ అహ్మమద్ బుధవారం గుండెపోటుతో మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి గురువారం సందర్శించి నివాళ్ళర్పించారు. నివాళి అర్పిం చిన వారిలో సర్పంచ్ హరిబాబు, బాలకోటయ్య, రమేషే, మార్కండేయులు ఉన్నారు.

'వైఎస్ఆర్' వర్ధంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 2న జరిగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నున్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు పాల్గొనాలని సూచించారు. వైఎస్ఆర్ అంటే ఆంధ్రప్రదేశ్ అభివద్ధికి ఒక ల్యాండ్ మార్క్ అని మహీధర్ రెడ్డి కొనియాడారు. ఈనెల 7న జరిగే అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

బలహీనంగా పిల్లలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు : అంగన్‌వాడీలలో బలహీనంగా ఉన్న పిల్లలపై ఐ సి డి ఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పౌష్టికాహారం, వైద్య సదుపాయం అందించాలని కలెక్టర్ ఎం హరి నారాయణ సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో ఐసిడిఎస్ సిడిపిఓలు సూపర్వైజర్లతో అంగన్‌వాడీలలో అమలవుతున్న కార్యక్రమాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వచ్చే పిల్లలలో బలహీనంగా ఉన్న పిల్లలకు గుర్తించి పౌష్టికాహారం అందించి ఎత్తు బరువు ,పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని,అలాగే చిన్నపిల్లల వైద్యునికి చూపించాలనిజిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు అంగన్వాడీలకు, ప్రీ స్కూల్ కు పిల్లలు సక్రమంగా వచ్చే విధంగా చూడాలన్నారు. 90 శాతం పైగా హాజరు ఉండాలన్నారు. పిల్లలకి ఇంటి వద్ద కూడా మంచి పౌష్టికాహారం అందించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమీక్షలో ఐసిడిఎస్ పిడి హేమ సుజనా, ఏపీ డి అనురాధ, సిడిపివోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో తనిఖీ

నెల్లూరు : నగరంలోని ఓ ప్రముఖ మెడికల్‌షాపులో డాక్టర్ చీటి లేకుండా నార్కోటిక్ డ్రగ్స్ (నిద్రమాత్రలు) విక్రయాలు చేస్తూ ఒడటాన్ని బుధవారం నిర్వహించిన దాడులల్లో ఔషద నియంత్రణాధికారులు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఔషద నియంత్రణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా , ఆ అధికారుల సిఫారస్సు మేరకు, ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గత కొన్ని రోజులుగా డ్రగ్స్ అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నాయని పక్కా సమాచారం రావడంతో ఔషద నియంత్రణాధికారులు ఆకస్మిక దాడి చేశారు. ఈ సమయంలో మందుల షాపులో అనధికారికంగా నిద్ర మాత్రలు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో షాపు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నెల్లూరు : నగరంలోని 11వ డివిజన్ సిపిఎం ఆధ్వర్యంలో ఆ డివిజన్ పరిధిలో స్థానిక సమస్యలు, మౌలిక సదుపాయాలు కల్పించుటకు అధిక ధరలు అదుపు చేయుటకు, నిరుద్యోగ నివారణ చర్యలు గురించి ప్రజల దగ్గర సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ షరతులకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా పెంచిన విద్యుత్తు చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సూచనల మేరకు సిపిఎం శ్రేణులు ఇంటింటికి వెళ్ళాలని, ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అర్జీ రూపంలో సేకరించనున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకొనేందుకు బిజెపి తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేస్తామని ప్రకటించినప్పటికి ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. చేసిన హామీలను బిజెపి విస్మరించిందన్నారు. ఈసమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 2వ తేదీ సచివాలయాల దగ్గర ధర్నా నాలుగో తేదీ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ దగ్గర జరుగు ధర్నా లో కూడా జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.సూర్యనారాయణ, టి.నారాయణ, శివకుమారి, పసుపులేటి మల్లికార్జున్, ఆదిలక్ష్మి, రవి, బట్టేపాటి వెంకటేశ్వర్లు, కత్తి చిన్నా, నాగరాజు, పి ప్రవీణ్, 11వ డివిజన్ శాఖ నాయకులు పాల్గొన్నారు.



11వ డివిజన్‌లో

5,6 డివిజన్లలో సంతకాల సేకరణ

వైసిపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు చేసిన హామీలను అనుసరించి సంక్షేమ పథకాలను ప్రారంభించి , కరెంట్ బిల్లు సాకుగా చూపి సంక్షేమ పథకాలు నిలిపివేయడం ఆపడం దారుణమని సిపిఎం నగర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం సిపిఎం సమరభేరి లో భాగంగా ఐదో డివిజన్ పరిధిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కమిటీ సభ్యులు నరసింహ, చిరంజీవి మాట్లాడుతూ పేద మధ్యత పెద్ద ప్రజలు పెరిగిన కరెంటు బిల్లుతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే సమయంలో పెరిగిన కరెంటు బిల్లు సాకుగా చూపే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిలిపివేయడం ఎంత వరకు న్యాయమన్నారు. గత 20, 30 సంవత్సరాలు నుంచి వచ్చే పెన్షన్ల సైతం ఆగిపోయాయని అవ్వా తాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అది చాలదన్నట్లు విద్యుత్తు తయారీ సంస్థకు నష్టాలు వచ్చాని చెబుతూ గతంలో వాడిన బిల్లులకు రకరకాల పేర్లతో భారీగా నగదు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని ఉపాధి లేక జిల్లాలోని యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. అభివద్ధి పరంగా రాష్ట్రంలో విశాఖ తర్వాత జిల్లా ఉన్నప్పుడుకి ఉపాధి కరువైందన్నారు. మరోపక్క రోజురోజుకీ అధిక ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని, వంట గ్యాస్ పప్పు నూనె ఇలాంటి నిత్యవసర ధరలు విపరీతంగా పెరగటం మూలాన ప్రజలకు పౌష్టికాహారం లోపించి అనారోగ్యానికి గురౌతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పెంచిన కరెంటు చార్జీలో అధిక ధరలు తగ్గించాలని యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాని పక్షంలో సెప్టెంబర్ 4వ తేదీన కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు శాఖ సభ్యులు రాంబాబు, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు

తోటపల్లిగూడూరు: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కొమ్ముకాస్తు పేదలపై పెనుభారాన్ని మోపుతున్నాయని సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, సీఐటీయు మండల కార్యదర్శి మరోబోయిన రాజా విమర్శించారు. మండలంలోని నరుకూరు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు, పెంచిన కరెంటు చార్జీలు ,పెట్రోల్, డీజిల్ ధరలు నిత్యవసర ధరల పెంపుపై మీద ప్రజల దగ్గర నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వెంకయ్య, మారుబోయిన రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద బడుగు బలహీన మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాన్ని మోపాయని ఆరోపించారు. పెట్రోలియం గ్యాస్ ధరలు, కరెంటు చార్జీలు పేరుతో విద్యుత్ సుంకము, ట్రూ అప్ చార్జీలు ,ఇంధన సర్దుబాటు చార్జీలు రకరకాల పేర్లతో వసూలు చేస్తున్నాయని వెంకయ్య, రాజాలు ధ్వజెమత్తారు. నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు నాశిన పరశురామయ్య, ట్రెజరర్ శివ, కమిటీ సభ్యులు వెంకట శేషయ్య, మనోహర్, చిన్న, నాశిన వెంకటేష్, ఉప్పల రఘురామయ్య, రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు పాకం పోలమ్మ, తులసమ్మ, జయమ్మ ఉన్నారు.



తోటపల్లి గూడూరులో..

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మాదక ద్రావ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సెబ్ సీఐ బాలకష్ణ సూచించారు. చెడు మార్గంలో 'యువత' అంశంపై తోటపల్లిగూడూరు మండలం ఈదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలకష్ణ మాట్లాడుతూ యువత మాదక ద్రావ్యాలకు బానిసలుగా మారి చెడు మార్గంలో పయనించి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారన్నారని బాలకష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత స్థితికి ఎదగాల్సిన యువత చెడు స్నేహాల కారణంగా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై విద్యార్థులు అవగాహన ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని బాలకష్ణ గుర్తు చేశారు. మాదక ద్రవ్యాల ప్రమాదంపై మరియు గుడ్ టచ్ లేక బెడ్ టచ్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇటువంటి తప్పులు తాము చెయ్యబోమని, చేసేవారిని క్షమించమని సీఐ బాలకష్ణ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ప్రధానో పాధ్యాయులు యన్. భాస్కరాయ్య, ఇంచార్జి మెడికల్ ఆఫీసర్ కె.రమేష్, మహిళ పోలీసు కె. సుప్రజా ఉన్నారు.



'ప్రకాశం'లో పిసిబి ప్రయోగశాల

కంచర్ల రామయ్య వెల్లడి

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ డిజైన్ మూడు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య తెలిపారు. విద్యార్థుల బహుళార్థసాధనకు తమ కళాశాలలో పిసిబి డిజైన్ ప్రయోగశాలను స్థాపించనున్నట్లు ఆయన ప్రకటించారు. కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ విద్యార్థులతో పి.సి.బి డిజైనర్లకు ఆనంద ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఏ.ఎస్.ఆర్ సర్క్యూట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గర్గ్ ఎలక్ట్రానిక్స్ లాంటి టాప్ టెన్ కంపెనీస్ లో పట్టుదలతో శ్రమించి ప్రయోగాత్మక జ్ఞానంతో ఉద్యోగాన్ని పొంది, తల్లిదండ్రుల కలను నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తపరిచారు.వర్క్ షాప్ నిర్వహిస్తున్న విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్,మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. సాయి సాందీప్ ఈ వర్క్ షాప్ లో ప్రకాశం కాలేజ్ డిప్లొమా మరియు బీటెక్ విద్యార్థులకు సర్క్యూట్లలో ఉపయోగించే భాగాల మధ్య తక్కువ ఇంటర్ కనెక్షన్ వైర్లతో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ ల డిజైన్ ను ఫ్రీ పిసిబి సాఫ్ట్వేర్ల ద్వారా నేర్పుతామన్నారు. విశిష్ట సంస్థ టెక్నికల్ డైరెక్టర్ శాస్త్రి, కాలేజ్ అకడమిక్ ఇన్చార్జ్ మీరవలి, ఈసీఈ ప్రొఫెసర్ వీకే రావు, అసోసియేట్ ప్రొఫెసర్లు కె. శ్రీకాంత్, అల్లా బగాష్, శ్రీదేవి , మీరా షరీఫ్ ఉన్నారు.



హరికృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి విరాభిమాని , యువగళం సారథి నారా లోకేష్ బాబుకు అత్యంత సన్నిహితులు తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ పుట్టినరోజు సందర్భంగా కందుకూరు పట్టణంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , బి.సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు , నెల్లూరు పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షులు పోకూరి రాంబాబు , నెల్లూరు పార్లమెంటు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అక్కిలగుంట ప్రకాశం, కందుకూరు నియోజకవర్గం తెలుగు యువత ప్రధానకార్యదర్శి కామినేని అశోక్ , ఉపాధ్యక్షులు జడ రవీంద్రబాబు ఉన్నారు.



సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-ఉలవపాడు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందరభంగా ఉలవపాడులో యువగళం సంఘీభావ పాదయాత్ర కార్యక్రమం ఉలవపాడు మండలలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, ఉలవపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు అంచుపోగు వాసు, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పజాశక్తి-కందుకూరు : నెల్లూరు ఉప రవాణా కమిషనరు బి చందర్ ఆదేశాల మేరకు గురువారం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, ఓగూరులో రహదారి భద్రతపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. కందుకూరు మోటారు వాహనముల తనిఖీ అధికారి ఎస్ కె యండి రఫీ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. ఎస్ విజయ పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో రహదారి భద్రత పట్ల కూడా అవగాహన అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు ఇద్దరు విద్యార్థులను ప్రోత్సాహిస్తూ రవాణా శాఖ కందుకూరు వారు హెల్మెట్ లను బహుకరించారు. కార్యక్రమంలో కళాశాల ఏ ఓ ముంతాజ్ బేగం ,కళాశాల సిబ్బంది, రవాణా శాఖ సిబంది పాల్గొన్నారు.



ఎపిపిగా ప్రసాద్ రెడ్డి నియామకం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సీనియర్ న్యాయవాది మాలె ప్రసాద్ రెడ్డి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులయ్యారు. కందుకూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు ప్రసాద్ రెడ్డి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ఆయన నియామకానికి సహకరించిన కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ,రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం మనోహర్ రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్చార్జి ఆర్ రోజా రెడ్డి, నెల్లూరు లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ సుబ్బారెడ్డికి ప్రసాద్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు, పబ్లిక్ ప్రాసి క్యూటర్‌గా నియమితులైన ప్రసాద్ రెడ్డికి సహచర న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

తప్పిన ప్రమాదం

-పొదలకూరు : పొదలకూరు మండలం తోడేరు చెరువు వద్ద గురువారం సాయంత్రం చెరువు కట్టపై వస్తున్న స్థానిక నారాయణ స్కూల్ బస్సు చిన్నపాటి వర్షానికి బురద ఉండడంతో ఒకవైపుకి ఒరిగిపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు పెద్ద ఎత్తున కేకలు వేశారు. డ్రైవర్ అప్రమత్తమై విద్యార్థులను దించేశారు. ఘటన జరిగిన వద్ద మరోవైపు చెరువు ఉంది. చెరువు వైపు బస్సు వాలి ఉండి ఉంటే చెరువులో బస్సు పడిపోయి ఉండేది. పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. నారాయణ స్కూల్ యాజమాన్యం ఆపాయకరంగా ఉన్న చెరువు కట్టలపై బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

శిక్షణతో మెరుగైన సేవలు

నెల్లూరు : ప్రజలకు నేరుగా సేవలందించే ఉద్యోగులు శిక్షణ తీసుకోవడం వల్ల క్షేత్ర స్థాయిలో మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. స్థానిక కొండాయపాళెంలోని జీసెస్ సెంటర్ లో జరుగుచున్న ఆరు రోజుల పంచాయితీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. శిక్షణార్థులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో శిక్షణ అనేది నిరంతర ప్రక్రియ అని , అన్నీ మనకు తెలుసున్న భావన సరికాదని, శిక్షణ వలన క్రొత్త విషయాలు తెలుసుకునే అవకాశంఉంటుందన్నారు.జిల్లా పరిషత్ సిఇఓ చిరంజీవి పాల్గొన్నారు.

5న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం 5వ తేదీ మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్‌ఖాన్ తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య శాఖ, గ్రామీణ నీటిపారుదల, పారిశుధ్య శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ శాఖపై సమీక్ష జరుగుతుందన్నారు. మండల అధికారులు వారి శాఖలకు సంబంధించిన మీటింగ్ నోట్స్‌ను సెప్టెంబర్ 3లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి మండల ప్రజాపరిషత్ సభ్యులు, మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

విట్స్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కావలి : స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సు చేరగోరేవారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు వందలాదిమంది విద్యార్థులు ,వారి తల్లిదండ్రులతో హాజరై,తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు తమ కళాశాలను ఎంచుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. అందుకుగానూ తమ కళాశాలలో తగిన వాతావరణం ఉందని తెలిపారు. కళాశాల సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కళాశాలలో చేరి,కష్టపడి చదివి, జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని, అందుకు విద్య ఒక్కటే సరైనమార్గమని తెలిపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు అనేక గొప్ప సంస్థలలో ఉద్యోగాలు పొందారని, వారు తమస్థానాలలో బాగారాణించి, ఆర్థికంగా స్థిరపడ్డారని తెలిపారు. విట్స్ కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి, అకడమిక్ చైర్మన్ ప్రత్యూషారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులను ఆశీర్వదించి, తమ శుభాకాంక్షలను తెలియజేశారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆత్మకూరు డిఎస్‌పి కోటారెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను, కేసుల వివరాలు, సమస్యలను, సిబ్బంది పనితీరును పరిశీలించామన్నారు. దానిలో భాగంగా స్టేషన్లోని రికార్డులు, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా కూడా సమస్యలు పరిస్కార మవుతున్నాయని తెలిపారు. ఆయనవెంట సిఐ వేణు, ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

ప్రజాశక్తి-ఉదయగిరి : కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి తెలిపారు. గురువారం పట్టణంలోని షబ్బీర్ కాలనీలో చుక్కలు దుప్పిని కుక్కలు దాడి చేసే క్రమంలో స్థానికులు అడ్డుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారి తుమ్మల ఉమామహేశ్వర రెడ్డి డిఆర్‌ఒ శ్రీనివాసులు తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని అప్పటికే చుక్కలు దుప్పి మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. అనంతరం పోస్టుమార్టం చుక్కలు దుప్పిని చేయించి ఖననం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒబి శ్రీనివాసులు, ఎఫ్‌బిఒ లక్ష్మి ప్రసన్న, జెకెవి ప్రసాద్, భానుతేజ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎన్నికల నియమావళిని అందరూ తప్పని సరిగా పాటించాలని లేకపోతే వేటు తప్పదంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ హెచ్చరించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లు కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వి.జగదీష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-కావలి : స్థానిక 8వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌సిసి కేడెట్లకు రక్తగ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ఎన్‌సిసి కేర్ టేకర్ కె వి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంగ్లభాష ఉపాధ్యాయులు రాఘవరావు పాల్గొని, కేడెట్లకు రక్తంలోని గ్రూపులు, రక్తదానం గురించి అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పద్మావతి, శేషమ్మ రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి, గుర్తింపు కార్డులను అందజేశారు.

108వాహనంలో కాన్పు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంగీత పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సిబ్బంది సకాలంలో స్పందించి పెద్దిరెడ్డి పల్లికి చేరుకొని 108 సిబ్బంది సంగీతను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో తరలిస్తుండగా, మార్గం మధ్యలో ఉదయగిరి మండలం గండిపాలెం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది వాహనంలోనే కాన్పు చేశారు. ఈఎంటి రాజ ఖాన్, పైలట్ మసూద్‌లు కాన్పు చేయగా తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో కావడంతో సమీపంలోని వైద్యశాలలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-కొండాపురం : మండలంలోని పోట్టిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు తిరిగి ప్రభుత్వం నుండి వచ్చిన సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బొడ్డు అనురాధ, సర్పంచ్ ఇరగల శేఖర్, బొడ్డు మల్లికార్జున, మండల కన్వీనర్ చిమ్మిరి రవీంద్ర, బండారు చంద్రశేఖర్, వేణుగోపాల్ రెడ్డి, బొడ్డు వేంరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మందపల్లి శేషగిరి పాల్గొన్నారు.

ప్రత్యక్ష పర్యవేక్షణతో క్షయ నివారణ

ప్రజాశక్తి-కోవూరు : ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని టిబి ఎయిడ్స్, హెచ్‌వి నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ తెలిపారు. కోవూరులోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధికి సంబంధించి అన్ని ఆసుపత్రిలోనూ ప్రాథమిక కేంద్రాలను మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా టిబి వ్యాధిగ్రస్తులకు రూ.500 రూపాయలు విలువచేసే పౌష్టికాహార కిట్లను దాతల సహకారంతో అందించేలా ఇప్పటికే రూపొందించినట్లు తెలిపారు.

అన్నవరం లైన్‌మెన్‌పై దాడి

ప్రజాశక్తి-జలదంకి : అన్నవరం సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ మొగిలి కలగయ్యపై దాడి చేసిన బుర్రి సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు జలదంకి ఎస్‌ఐ పి.ఆదిలక్ష్మి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం అన్నవరం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, బుర్రి సుధాకర్ కరెంటు విషయంపై లైన్మెన్ కు ఫోన్ చేశారు. గాలి వానకు ఎక్కడో లైన్ తెగి కరెంటుకు అంతరాయం ఏర్పడిందని ఈ విషయం పరిశీలిస్తున్నామని లైన్మెన్ తెలిపారు. అయితే విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన తర్వాత లైన్‌మెన్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై లైన్మెన్ జలదంకి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గురువారం జలదంకి ఎస్‌ఐ పి.ఆదిలక్ష్మి కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-జలదంకి : కావలి ఉదయగిరి రోడ్డుపై జలదంకి పోలీస్ స్టేషన్ ఎదురుగా గురువారం జలదంకి ఎస్‌ఐ పి.ఆదిలక్ష్మి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. మోటార్ సైకిలను ఆపి డ్రైవింగ్ లైసెన్సులను, మోటార్ వాహనాల ఆర్‌సిలను పరిశీలించారు. ఆటో వాహనదారులు పరిమితి మించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించుకుంటే వారికి అపరాధ రుసుము వెలకట్టతామని హెచ్చరించారు. జలదంకి ఏఎస్‌ఐ దేవదానం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని నాగిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఎన్‌హెచ్-167 రోడ్డుపై స్పీడ్‌గా వెళుతూ రెండు చక్రాలు ఊడి రోడ్డుపై పడి ఫల్టీ కొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది ప్రమాదంలో చిన్న మాలకొండయ్య అనే అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వీరు హైదరాబాద్ నుడి స్వగ్రామం చౌటపల్లికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కేసు నమోదుచేసి విచారణ చేపట్టామని ఎస్‌ఐ సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు.

మినీ లారీ బోల్తా

ప్రజాశక్తి-వరికుంటపాడు : గేదెను తప్పించబోయి కూల్‌డ్రింక్స్ మినీ లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ఘటన జరగ్గా స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు నుండి కూల్ డ్రింక్స్ లోడ్ వేసుకొని చిత్తూరు జిల్లా మదనపల్లికి వెళ్తున్న మినీ లారీ రోడ్డుకి అడ్డంగా వస్తున్నా గేదెను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్ కు క్లీనర్‌కి గాయాలు అయ్యాయన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని సమ్మె

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్‌కు కార్మికుల చర్చ
- నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ
- సమ్మె విరమించి విధుల్లోకి హాజరైన కార్మికులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల శాఖ ఆధ్వర్యం లో గురువారం ఉదయం నుండే విధులకు హాజరు కాకుండా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర మాట్లాడుతూ ఎంఎల్ఏ సిఫార్సు చేసిన దాగులూరు పెద్ద బుజ్జయ్య పదవి విరమణ పొందారని, ఆయన కుమారెడ్డి కాంట్రాక్టు పద్ధతిలో మున్సిపాలిటీలో స్వీపర్‌గా ఉద్యోగం కల్పించాలన్నారు. చనిపోయిన ఎస్.చిన్న బుజ్జయ్యకు మట్టి ఖర్చులు ఇప్పటివరకు ఇవ్వకపోవడం ఈపిఎఫ్ డబ్బులు వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు పుష్ కాట్స్,



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పొరకలు, పారలు, ఇవ్వాలని తెలిపారు. 2016-17 సంవత్సరం నాటికి రావాల్సిన అరియర్స్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మిగతా సిబ్బంది అందరికీ ఇచ్చి పారిశుధ్య కార్మికులకు 38 మందికి చెల్లించకపోవడం వ్యతిరేకిస్తున్నామని వెంటనే పరిష్కరించాలని కోరారు. యూనిఫారం, సోపు, చమురు, చెప్పులు కార్మికులకు అందించాలన్నారు. ఉన్న కార్మికులకు ఉద్యోగం ఇవ్వకపోగా 14 మందిని బయట కార్మికులను పెట్టడంపై తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులు చర్చలకు ఆహ్వానించడంతో ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ఛాంబర్‌లో చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, కార్మికులు, సిఐటియు గౌరవ అధ్యక్షులు కోప్పోలు డేవిడ్ రాజు, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య కార్మికులు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకటరమణమ్మ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ బి.నాగేశ్వర రావును కోరారు. వెంటనే కమిషనర్ చనిపోయిన కార్మికుడు చిన్న బుజ్జయ్యకు మట్టి ఖర్చులు ఇవాళ్ చెల్లిస్తామని కమిషనర్ హామీనిచ్చారు. అరియర్స్ బకాయిలు నెల లోపు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు.

ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దు..

- మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

కొంతమంది కార్మికుల వద్ద పర్మినెంట్ చేయిస్తానని డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు అందింది. వారిపై చర్యలు తీసుకుంటాము. ఇకమీదట కార్మికులు ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని కార్మికులకు సూచించారు.

రూ.2లక్షలు అందజేత

ప్రజాశక్తి-జలదంకి

ఇటీవల రామవరప్పాడు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన జలదంకి నరసింహారావు కుటుంబానికి టిడిపి తరపున రూ.2లక్షల ఇన్సూరెన్స్‌ను ఉదయగిరి మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు మృతిని భార్య జలదంకి కళ్యాణికి అందజేశారు. గురువారం జలదంకిలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరలా వైసిపి అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. త్వరలో టిడిపి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 8 మండలాలలో నారా చంద్రబాబు నాయుడుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని 45 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి వ్యక్తికి ఎంతమేర లబ్ధి చేకూరుతుందనే విషయాన్ని ఇంటింటికి తిరిగి తెలియజేస్తామన్నారు. ఎల్ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ మంగళ తిరుమలను స్థానిక నేత కొగ్రపాటి



చెక్కును అందజేస్తున్న మాజీ ఎంఎల్ఎ బొల్లినేని

రామారావులను చాలు వాళ్లతో సత్కరించారు. గమళ్లపాలెం గ్రామానికి చెందిన అన్నం కామేశ్వరమ్మ, రమేష్ దంపతుల కుమార్తె అన్నం పూజిత వివాహం జరుగుతున్న నిరుపేద కుటుంబానికి రూ.10వేల నగదును మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పులుగుంట మధుమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ పచ్చ పెంచలనాయుడు, రామవరప్పాడు సర్పంచ్ రవి నాయుడు, ఉదయగిరి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి సుధీర్ బాబు, ఐటిడిపి మండల కన్వీనర్ జలదంకి యోగూరి రఘు, తెలుగు యువత అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి, మావిళ్ల మదన్ మోహన్, చుండూరు మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాటం

ప్రజాశక్తి-కావలి రూరల్



కేంద్ర, రాష్ట్ర ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం 17వ వార్డు బుడంగుంట గ్రీన్ సిటీ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక విధానాలపై సిపిఎం 30వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సమరభేరి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రజలకు వరగ పెట్టిందేమీ లేదని, అన్ని రకాల నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందన్నారు. నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతూ నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోగా రకరకాలుగా ప్రజలపై భారాలు మోపి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారన్నారు. మన ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజలపై మోయలేని బారాలు మోపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, భోగిశెట్టి కిష్టయ్య, వి.బాబురావు, పూల సుబ్రహ్మణ్యం, మేడ వెంకటేశ్వర్లు, తలపల రత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేకపాటి ఇంటికి హర్యానా గవర్నర్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి నివాసానికి హర్యానా రాష్ట్ర గవర్నర్, బిజెపి మాజీ పార్లమెంట్ సభ్యులు బండారు దత్తాత్రేయ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మేకపాటి నివాసంలో ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి పృథ్వీకుమార్ రెడ్డిలతో కలసి నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ గత స్మృతులను నెమరువేసుకున్నారు. గతంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యునిగా మేకపాటి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గం నుండి పార్లమెంట్ సభ్యునిగా బండారు దత్తాత్రేయ ప్రాతినిధ్యం వహించిన క్రమంలో పార్లమెంట్‌లో విషయాలను, తమ మధ్య మైత్రి బంధాన్ని ఆనందంగా పంచుకున్నారు. హర్యానా గవర్నర్ బండారు నెల్లూరు జిల్లాలో వైఎస్సార్సీపీ పార్టీ విషయాలను, ఆత్మకూరు నియోజకవర్గంలో అభివద్ధి, సంక్షేమ పథకాల విషయాలను, కుటుంబ సభ్యుల గురించి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిని, ఆయన సోదరుడు మేకపాటి పృథ్వీకుమార్ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేకపాటి రాజమోహన్ రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని వారితో పంచుకున్నారు.

ఆకట్టుకొన్న నమూనా జి-20 సదస్సు

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్త్ రాజుపాలెం హై స్కూల్‌లో విద్యార్థులు గురువారం నిర్వహించిన మాక్ జి-20 సదస్సు ఎంతగానో ఆ కొట్టుకొంది. ఢిల్లీలో 8, 9 తేదీలలో జి-20 సదస్సు జరుగనుంది. ఈ సందర్భంగా హై స్కూల్ ప్లస్ హెచ్ ఎమ్‌డి ఓబులేసు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వల్ల విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంపొందించడంతోపాటు వేదికలపై మాట్లాడేటప్పుడు భయం పోతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, చిట్టిబాబు, మల్లికార్జున, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు పాత పద్ధతిలోనే అమలు చేయాలి

ప్రజాశక్తి-కావలి



పొలాలు, స్థలాలు రిజిస్ట్రేషన్ సమయంలో కొత్త ఆన్‌లైన్ పద్ధతికాక పాతపద్ధతినే అమలు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖరులు గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రెండవరోజు పెన్‌డౌన్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ గతంలో తాము దస్తావేజులు రాసి, తయారు చేస్తే, రైతులు, విక్రయదారులు సంతకాలు చేసి, క్రయ విక్రయాలు పూర్తి చేసుకునేవారని తెలిపారు. ఈ సందర్భంలో ఏమైనా తప్పులుంటే సవరించి దస్తావేజులు రిజిస్టర్ చేసుకునేవారని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో ఎవరైతే రిజిస్ట్రేషన్ చేసుకుంటారో, ఆ వ్యక్తులే కంప్యూటర్‌లో లాగిన్ అయి, వారికివారే అప్లికేషన్‌లోని ఖాళీలను పూరించి, సబ్‌రిజిస్ట్రార్‌కి సమర్పిస్తే, వారికి స్లాట్ ఇచ్చి, రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారని తెలిపారు. అందులో రైతు పొరపాటున రాసుకున్నా, సవరణ చేసుకోవడానికి చాలా ఇబ్బంది పడుటకు అవకాశం కలదన్నారు. వారికి సరైన హక్కులు సంక్రమించవన్నారు. మళ్లీ సరైన ఇంగ్లీషు భాష రాని వారికి, సదరు దస్తావేజులో ఏమి రాసుకున్నారో కూడా కక్షిదారునికి ఏమాత్రం అర్థం కాదన్నారు. కావున రైతు గానీ, రైటరు గానీ పాతవిధానాన్నే కోరుతున్నారని తెలిపారు. రూ.100 స్టాంపు నుండి రూ.1,000 స్టాంపులను ప్రభుత్వం సరఫరా చేయనందువల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రూ.100,50 స్టాంపులు ఆపి, స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చారన్నారు. ఇందువలన ప్రజలు చాలా ఇ బ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. అందుచేత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ పిడి-20 విధానాన్ని విరమించుకుని, పాత పద్ధతినే అమలులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. కార్యక్రమం లో లేఖరులు నాగరాజ కుమార్, పి.డి.వి.ఎం. ప్రసాద్, షేక్.మస్తాన్, వెంకట్రావు, గౌస్‌బాషా, రామకృష్ణ, సర్రాజు శ్రీనివాసులు, శిఖరం వెంకటశేషయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట స్టాంప్ వెండర్లు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెండర్లు మాట్లాడుతూ రెండు రోజులపాటు చేపట్టే నిరసన దీక్షలు ముగిశాయని ఈ రిజిస్ట్రేషన్లకు కొత్త సాఫ్ట్‌వేర్ విధానాన్ని తీసుకురావడం బాధాకరమన్నారు. ఈ విధానం వల్ల తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్డు ప్రైమ్ 2.0 పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్ డాక్యుమెంటేషన్ చేయడం వల్ల వెండర్లు కంప్యూటర్ ఆపరేటర్లు రైటర్లతో పాటు తమ కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ఈ విధానాన్ని తొలగించి పాత పద్ధతి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

'బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ'

ప్రజాశక్తి-కావలి



కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్న "బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ" శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి నియోజక వర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర తోపాటు నియోజక వర్గంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘ కమిటీ సభ్యులు, ఐటిడిపి సభ్యులు, రాబిన్ శర్మ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నందమూరి వంశాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రజలను దృష్టిలో ఉంచుకొని మినీ మహానాడులో ప్రకటించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ పథకం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని పార్టీ కుటుంబ సభ్యులందరినీ కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పూర్తి భరోసా, యువగళం నిధి నుంచి నిరుద్యోగ భృతి, బీసీలకు రక్షణ చట్టంవంటి అద్భుతమైన పథకాలతో పేద ప్రజలను ధనవంతులుగా మార్చవచ్చని అభివర్ణించారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలను తెలుపుతూ తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ళ నిండిన ప్రతి స్త్రీకి సంవత్సరానికి రూ.18వేలు, ఏడాదికి మూడు సిలిండర్లు ప్రతి ఇంటికి అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ప్రతిరైతుకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం చేస్తామన్నారు. 20 లక్షల మంది యువతకు ఉపాధితో పాటు, నిరుద్యోగ భృతి కింద యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. బిసిలకు రక్షణ చట్టం తెచ్చి వారికి కొండంత అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు 100 మంది ఓటర్లకు ఒక వాలంటరీని ఏర్పాటు చేయాల్సిందిగా నాయకులను కోరారు. టిడిపితోనే అణగారిన ప్రజలు చైతన్యవంతులు అవుతారని, చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవడమే ధ్యేయమన్నారు. ఎన్నికల సమయం విచ్చేస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా మారి వైకాపాను ఈ రాష్ట్రం నుంచి సాగనంపాలన్నారు.

మినరల్ వాటర్ వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం వెంగళరావు నగర్లో సంయుక్త నృత్య కళానిలయం నిర్వహిస్తున్న నాట్య గురువు గంగపట్నం లిఖిత సహాయంతో గురువారం కాలేరుగుంట దగ్గర రోడ్డుపై పట్టలతో ఇల్లు నిర్మించుకొని యాచించు కుంటూ దుర్భరంగా జీవనం సాగిస్తున్న గిరిజనులకు మినరల్ వాటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త నృత్య కళా నిలయం ద్వారా ప్రతి నెలా వచ్చే ఫీజులలో కొంత ఫీజులు సేవలకు వినియోగించాలనే ఉద్దేశంతో లిఖిత పేదలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతినెలా నృత్య శిక్షణ ద్వారా వచ్చే ఫీజులలో కొంత భాగాన్ని కేటాయించి ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు.


యువగళం పాదయాత్రకు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-కావలి

నారా లోకేష్ బాబు చేపట్టిన "యువగళం పాదయాత్ర" 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సంఘీభావం తెలియచేస్తూ, కావలి పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ స్థానిక పార్టీ కార్యాలయం నుండి సంఘీభావ యాత్ర ప్రారంభమై శివాలయం రోడ్డు, పోలేరమ్మ గుడి మీదుగా విష్ణాలయం రోడ్డు, ట్రంక్ రోడ్డుకు చేరుకొని అక్కడ నుండి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు భారీ సంఖ్యలో పాల్గొన్న పార్టీ శ్రేణుల నినాదాలతో సాగింది. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘ కమిటీ సభ్యులు, ఐటిడిపి సభ్యులు, రాబిన్ శర్మ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

'బొల్లినేని'కి రాఖీలు కట్టిన మహిళలు

ప్రజాశక్తి జలదంకి



రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళలు ఉదయగిరి నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త బొల్లినేని వెంకట రామారావుకు గురువారం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బొల్లినేనికి ఉదయగిరి నియోజకవర్గం మహిళా ప్రధాన కార్యదర్శి పచ్చ మనీషా చౌదరి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు ఎన్నికలలో ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బొల్లినేనికి రాఖీ కట్టిన మహిళలు

ప్రజాశక్తి-కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరిలోని బొల్లినేని క్యాంప్ కార్యాలయంలో మహాశక్తి మహిళలు రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బొల్లినేని రామారావు కి మహిళలు రాఖీ కట్టి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నీటిగుంతను శుభ్రం చేయాలి

- చౌదరిపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి-కావలి



ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న చౌదరిపాలెం గ్రామస్తులు

కావలి మండలం చౌదరిపాలెం గ్రామం పడమటివైపున ఉన్న నీటిగుంట గత 4ఏళ్లగా నీరు నిల్వ ఉండడంతో, అది దుర్గంధ భూయిష్టంగా, వ్యాధులు వచ్చే విధంగా నీరు కలుషితమై ఉన్నాయని, సదరు నీటిని తొలగించి, నీటిగుంటను మంచినీటితో నింపుకునే విధంగా ప్రభుత్వ అధికారులు గ్రామస్తులకు అనుమతినివ్వాలని చౌదరిపాళెం గ్రామస్తులు కోరారు. గురువారం ఈ విషయమై వారు కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ వి.కె.శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నీటిగుంతలోని అశుభ్రమైన నీరు పక్కనే ఉన్న మంచినీటి బావిలోకి దిగుతున్నాయని, అందువల్ల ఈ నీటిని తాగినవారు అనారోగ్యాలపాలవుతున్నారని తెలిపారు. తాము తలాకాస్త డబ్బులు వేసుకుని, సదరు గుంటను శుభ్రం చేస్తుండగా, ఎవరో చేసిన ఫిర్యాదుతో అధికారులు వచ్చి, తమ ప్రయత్నాన్ని ఆపారని తెలిపారు. తాము ఇప్పటికే సదరుగుంతలోని మురికినీరు తొలగించడానికి రూ.20వేలు ఖర్చు పెట్టామని, మరో రూ.20వేలు ఖర్చు చేసి సదరు నీటిని తొలగించి, గుంటను శుభ్రం చేసుకుని, మళ్లీ మంచినీరు పెట్టుకుంటామని అందుకు మున్సిపల్ ప్రత్యేకాధికారి(ఆర్‌డిఇ), మున్సిపల్ కమిషనర్‌లు స్పందించి అనుమతులు ఇప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో సదరు గ్రామస్తులు అమరేంద్ర, పి.వంశీ, జి.రంగారావు, మందలపై సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, కె.అంకమ్మరావు, జి.సూరిబాబు, మండవ పూర్ణచంద్రరావు, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న అధికారులు

: ఎస్‌సి, ఎస్‌టి కులాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తహశీల్దార్ జగదీష్ బాబు, ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని దాసరపల్లిలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఎఎస్‌డబ్ల్యూఒ ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో బతికే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.మల్లికార్జున, గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పలు శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బడిఈడు కలిగిన పిల్లలందరూ పాఠశాలలలో, కళాశాలలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అందరూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. గురువారం సచివాలయ పరిధిలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో(స్థూల నమోదు నిష్పత్తి) గురించి కరటం పాడు, వెన్నవాడ, బోయిలచిరువెళ్ల సచివాలయాల సిబ్బంది వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఏ విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా స్కూల్లో ఉండే విధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల భవిష్యత్తు బాగుపడాలంటే వారిని తప్పక బడిలో చేర్చే విధంగా ఒప్పించి తిరిగి జాయిన్ చేయించాలని సూచించారు.

ఆత్మకూరు ఎంఇఒ-2 చలపతి మాట్లాడుతూ పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను ఆ ప్రాంతంలోని హైస్కూలు ప్రధానోపాధ్యాయులు తిరిగి స్కూల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరటంపాడు పాఠశాల ప్రధానోపాధ్యా యులు మాలకొండలరావు, పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భూహక్కు-భూరక్ష


ప్రజాశక్తి-సంగం : సంగం గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ సురక్ష పథకంలో భాగంగా రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అశోక్ కుమార్ డ్రోన్ ద్వారా భూ సర్వే నిర్వహించారు. సర్వేయర్‌తో పాటు ప్రత్యేక బృందం ఈ సర్వేను చేపట్టింది. అనంతరం రైతుల వద్దకు వెళ్లి వివాదాలు పరిష్కారం దిశగా భూ సర్వే చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక కమ్యూనిటీ సర్వేయర్ సుందర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను రాబట్టే బోధన అందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలు సామర్థ్యాలను రాబట్టే విధంగా బోధనోపకరణ సామాగ్రితో సులభతరహా బోధన అందించాలని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థాని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సముదాయ సమావేశాన్ని ఆయన సందర్శించారు. బోధనోపకరణ సామాగ్రిని తయారు చేసుకుని విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



పేదరికంలో పుట్టడం తన తప్పు కాదని ఎన్ని అవకాశాలు ఇచ్చినా ఎన్ని అవకాశాలు వచ్చినా అవకాశాలను ఉపయోగించుకోక పోవడం మన అసమర్థత అని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటేనే ఎదగడానికి అవకాశాలు ఉంటాయని ఎపి ఎంఐపిపిడి, ఫుడ్ ప్రాసెస్సింగ్ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గం 6 మండలాల ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎంఐపి పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులుగా చేయడం పారిశ్రామికవేత్తలుగా చేయడం అందులో భాగంగా డ్వాక్రా మహిళలకు వ్యక్తిగతంగా రెండు లక్షల నుండి 10 లక్షలు వరకు లోన్లు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి 6 మండలాలు కలిపి 60 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు డిడి సురేష్ మాట్లాడారు. వివరాల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ రిసోర్స్ పర్సన్ భానుచందర్ నెంబర్‌ను 8555973198 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిఐసి, ఐపిఒ, శ్రీనివాసరావు, కెనరా బ్యాంక్ ఫైనాన్స్ లెట్రిసి కోఆర్డినేటర్ రవి శంకర్, ఫుడ్ ప్రాసెసింగ్ డిఆర్పి వెంకటేశ్వర్లు, భానుచందర్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, వెలుగు ఎపిఎం వెంకమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి

కావలి మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో గురువారం కావలి సబ్ జైలులో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించినారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అక్కడ వున్న ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా మెలగాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం వారు కల్పిస్తున్న అవకాశాలు ఉపయోగించుకొని సమాజంలో గౌరవంగా జీవించాలి అని, నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్ ఖైదీలకు తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.